క్లుప్తంగా

వైఎస్సార్ బీమా మట్టి ఖర్చుల అందజేత



రాజేష్ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా మట్టి ఖర్చుల నిమిత్తం అందచేస్తున్న నగదు

చింతలపూడి : ఇటీవల చింతలపూడిలో రోడ్డు ప్రమాదంలో కొండా రాజేష్ అనే వ్యక్తి మృతి చెందాడు. అతని కుటుంబానికి స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ ఎస్ రాంబాబు గురువారం వైఎస్సార్ బీమా మట్టి ఖర్చులు రూ.10 వేలు అందజేశారు. బీమా సొమ్ము కూడా త్వరలోనే అందే ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ సెక్రటరీ రాజా, వెల్ఫేర్ అసిస్టెంట్ వేణు, వలంటీర్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్ఆర్ గ్రామసభ



కుక్కునూరులో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

కుక్కునూరు : పోలవరం ప్రాజెక్ట్ 41.15 కాంటూర్ పరిధిలో ముంపునకు గురవుతున్న కుక్కునూరు ఏ బ్లాక్ కు సంబంధించి ఇంటి నిర్మాణాలకు ఆర్అండ్ ఆర్ పరిహారం అందించే విషయమై అధికారులు గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాసితుల వద్ద నుంచి తగిన ఆధారాలను సేకరించారు. అంతేకాక జాబితా నుంచి మిస్సైన పేర్లకు సంబంధించి పంచాయతీ తీర్మానం చేసి అధికారులకు అందించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, కుక్కునూరు తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర, వీఆర్ఓలు ఇబ్రహీం, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పంచాయతీతోనే అభివృద్ధి సాధ్యం



సమావేశమైన పంచాయతీ సాధన సమితి సభ్యులు

టి.నరసాపురం : ఎర్ర కాలువ వెలుపల ఉన్న గ్రామాలకు ప్రత్యేక పంచాయతీ సాధనతోనే అభివృద్ధి సాధ్యమని ప్రత్యేక పంచాయతీ సాధన సమితి సభ్యులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని పుట్రేపులో నూతనంగా నిర్మించిన విలేజ్ క్లినిక్ వద్ద పుట్రేపు, రుద్రకోటరాజుగూడెం, కృష్ణాపురం, ప్రకాష్ నగర్ గ్రామాలకు చెందిన యువకులు, పెద్దలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టి.నరసాపురం పంచాయతీలో ఉన్న ఈ ఆరు గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయన్నారు. ప్రత్యేక పంచాయతీ ఏర్పడే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. కమిటీ సభ్యులు భుక్యా వేణు, అర్జా సాగర్, తాడేపల్లి చందు, కుంజా రవికిరణ్, యువరాజు, వీరభద్రుడు, రామకృష్ణ, రాజేష్, యుగంధర్ పాల్గొన్నారు.

జనన, మరణ, వివాహాల నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్): జనన, మరణ, వివాహాలను తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి సూచించారు. ఈ మేరకు స్థానిక కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయసేవాసదన్ భవన్‌లో గ్రామ, మండల, మున్సిపాల్టీ పరిధిలోని సచివాలయ సంబంధిత అధికారులతో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ సచివాలయం లేదా రిజిస్టర్ ఆఫీస్ లేదా మున్సిపల్ ఆఫీస్‌లలో జనన నమోదు, వివాహ నమోదు సంబంధిత ఆఫీసుల్లో చేయించుకోవాలని సూచించారు.

28న చేనేత కార్మికుల ఆందోళన

ఏలూరు (టూటౌన్): బడ్జెట్లో చేనేతకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని కోరుతూ ఈ నెల 28న జిల్లాలోని సచివాలయాల వద్ద ఆందోళన చేయనున్నట్లు ఏపీ చేనేత కార్మికక సంఘం జిల్లా అధ్యక్షులు కాసా రత్న కుమార్, జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషులు తెలిపారు. స్థానిక పవరుపేటలోని సంఘం జిల్లా కార్యాలయంలో గురువారం వారు విలేకర్లతో మాట్లాడారు.

బాలుడి అదృశ్యం

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో బాలుడు అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. 8వ తరగతి చదువుతోన్న తూర్పువీధి ప్రాంతానికి చెందిన ప్రసాదం నాగ తనుష్ గురువారం ఉదయం తల్లి రాజేశ్వరితో కలిసి ఇంటి సమీపంలోని సాయిబాబా గుడికి దర్శనానికి వెళ్లారు. తల్లి గుడి వద్ద ఉండగానే ఇంటికి వెళ్లిపోతానంటూ చెప్పి నాగ తనుష్ వచ్చేశాడు. ఇంటికి వచ్చిన తల్లికి కుమారుడు కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో వాకబుచేసినా ఆచూకీ దొరకలేదు. తల్లి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పార్టీ కోసం శ్రమిస్తున్న వారికే గుర్తింపు



ఏలూరు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన వందనపు సాయిబాలపద్మను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా ప్రచార కార్యదర్శిగా నియమితులైన జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జిని అభినందిస్తున్న దృశ్యం



జిల్లా యువజన విభాగం అధ్యక్షులుగా నియమితులైన పడమటి గిరిబాబు గౌడ్‌ను అభినందిస్తున్న పార్టీ నేతలు

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పదవుల్లో చింతలపూడి నియోజకవర్గానికి చెందిన ముగ్గురికి జిల్లా పదవులు
- హర్షం వ్యక్తం చేస్తున్న పార్టీ శ్రేణులు

జంగారెడ్డిగూడెం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పదవుల్లో చింతలపూడి నియోజకవర్గానికి ప్రాధాన్యత లభించింది. గురువారం ప్రకటించిన పార్టీ పదవుల్లో నియోజకవర్గంలోని జంగారెడ్డిగూడెంకు చెందిన నాయకులు ముగ్గురికి జిల్లా స్థాయి పదవులు లభించడం పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల్లో ఆనందాలు వెల్లివిరుస్తున్నాయి. పార్టీ పట్ల విధేయతతో, పార్టీ అభివృద్ధికి అలుపెరుగని కృషిచేస్తున్న వారికి తగిన గుర్తింపు లభిస్తుందనడానికి ఈ పదవులే నిదర్శనం అని పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన వందనపు సాయిబాలపద్మను, జిల్లా ప్రచార కార్యదర్శిగా నియమితులైన జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జిని, జిల్లా యువజన విభాగం అధ్యక్షులుగా నియమితులైన పడమటి గిరిబాబు గౌడ్‌ను నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు ఇచ్చి, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎంపీపీ కొడమజ్యోతి, పట్టణాధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు, వైస్ చైర్మన్‌లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, మల్నీడి బాబి, గురజాల పార్థసారథి, బత్తిన చిన్న, సీహెచ్ సునీత, కె.రమాదేవి, కె.మల్లిబాబు, చింతా అనిల్, చిప్పాడ వెంకన్న, గంజి వినోద్, పంది రాజా, అమీర్, కంచర్ల విష్ణు, తేజ గౌడ్, రాజేష్, పెప్సీ శ్రీను, పోసిబాబు, కౌన్సిలర్‌లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించిన వారిలో ఉన్నారు.

పార్టీ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషిచేస్తా



కొవ్వాసి నారాయణ

బుట్టాయగూడెం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కొవ్వాసి నారాయణ తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసి సేవచేసే అవకాశాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని, మళ్లీ రెండోసారి నూతనంగా ఏర్పాటైన ఏలూరు జిల్లాలో కూడా ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసినందుకు రుణపడి ఉంటానన్నారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని, ఎమ్మెల్యే తెల్లం బాలరాజులకు కృతజ్ఞతలు తెలిపారు.

సామాజిక సారథి సీఎం వైఎస్ జగన్



సమావేశంలో మాట్లాడుతున్న మహిళా ప్రజాప్రతినిధులు

కొయ్యలగూడెం : రాష్ట్రంలో సామాజిక న్యాయాన్ని అమలు చేస్తూ సామాజిక సారధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తిదాయకంగా నిలిచారని పశ్చిమ డెల్టా బోర్డు చైర్‌పర్సన్ గంజిమాల దేవి పేర్కొన్నారు. గురువారంలోని ఆమె నివాసంలో మహిళా ప్రజాప్రతినిధులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అంబేద్కర్, జ్యోతిరావు పూలే భావజాలాలతో అణగారిన వర్గాల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వెనుకబడిన వర్గాలను చట్టసభలకు పంపడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్తు ఉపాధ్యక్షురాలు మట్ట వనజా లక్ష్మి, ఎంపీటీసీ ఘంటసాల శీనమ్మ, రాష్ట్ర హిస్టరీ అకాడమీ డైరెక్టర్ చిక్కాల మంగతాయారు, రాష్ట్ర ఫిషరీస్ డైరెక్టర్ టి.గుబ్బాలు, మహిళా నాయకురాలు తోట కల్యాణి, పైలా జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దుష్ప్రచారాలే పచ్చమీడియా నైజం

కొయ్యలగూడెం : దుష్ప్రచారాలను ప్రచురిస్తూ, సత్యాలను మరుగున పరుస్తూ ప్రజాస్వామ్యానికి, పత్రిక రంగానికి ఈనాడు మీడియా వ్యవస్థ గొడ్డలి పెట్టుగా మారిందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం సాయంత్రం మెయిన్ సెంటర్‌లో పార్టీ శ్రేణులు ఈనాడు పత్రికలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా ఛీత్కారానికి జవసత్వాలు కోల్పోయిన తెలుగుదేశం పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి పచ్చ మీడియా ప్రాకులాడుతోందన్నారు. అడ్డదారులు తొక్కే రాచ గురువింద రామోజీ కుతంత్రాలకు అడ్డు అదుపు లేకుండా పోతోందన్నారు. జాతీయ మీడియా వ్యవస్థ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని అభినందిస్తుంటే, అందుకు విరుద్ధంగా పచ్చ మీడియా పచ్చకామెర్లతో రాష్ట్ర అభివృద్ధిని చూడలేకపోతోందన్నారు. ఈ సందర్భంగా ఈనాడు మీడియాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పెద్ద ఎత్తున ఈనాడు పత్రికలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో జగనన్న సచివాలయం మండల కో-ఆర్డినేటర్ నూకల రాము, మాజీ ఎంపీపీ మట్టా సత్తిపండు, పట్టణ అధ్యక్షుడు శంకు కొండ, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, పార్టీ శ్రేణులు గిద్దే సూర్యచంద్రం, మారిసెట్టి శ్రీను, గొలిసెట్టి ప్రసాద్, పోతు శ్రీరామమూర్తి, పల్లంట్ల శ్రీను, కత్తవ రాజేష్, పూలపల్లి రవి, ఎస్‌కే నాగూర్, పూనెం కన్నయ్య, చిక్కాల మణికంఠ, మడుతూరి శ్రీను, చిన్నం శ్రీను, ఆటో రాజు, ఎం.వాసు తదితరులు పాల్గొన్నారు.

పూర్తి నిబద్ధతతో విధులను నిర్వర్తించాలి



విధులపై మహిళా పోలీసులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ కేవీ సత్యనారాయణ

జంగారెడ్డిగూడెం : సచివాలయ మహిళా పోలీసులు విధి నిర్వహణలో పూర్తి నిబద్ధతతో వ్యవహరించాలని డీఎస్పీ కేవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో గురువారం సచివాలయ మహిళా పోలీసులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రకాల సేవలు ప్రజలకు అందాలనే ఉద్దేశంతోనే సచివాలయ వ్యవస్థ ఏర్పాటు జరిగిందని, దీనిలో రక్షణ కూడా ఒక భాగమన్నారు. మహిళలకు పూర్తి భద్రత, గ్రామాల్లో శాంతిభద్రతలు మెరుగుదల తదితర విధులు మహిళా పోలీసులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఎక్కడా ఎటువంటి అసాంఘిక ఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తూ, ఏవైనా అనుమానాస్పద విషయాలు ఉంటే స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. మహిళా చట్టాలను పూర్తిగా తెలుసుకుని మహిళలు, బాలికలు, చిన్నారులకు రక్షణ కల్పించేలా అందుబాటులో ఉండాలన్నారు. అలాగే నిర్దేశించిన ప్రతి విధిని తూ.చ తప్పకుండా నెరవేర్చాలన్నారు. ఈ సందర్భంగా మహిళా పోలీసుల విధులను ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ బాల సురేష్‌బాబు, ఎస్సై ఎం.సాగర్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలో బీసీలకు ప్రత్యేక గుర్తింపు

ఏపీ లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ నవీన్‌బాబు



లింగపాలెం: రాష్ట్రంలో బీసీలను గుర్తించి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చింది జగనన్న ప్రభుత్వమేనని ఏపీ లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు అన్నారు. గురువారం ఆయన భోగోలులోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయా వర్గాల అభ్యున్నతి ఆయనతోనే సాధ్యమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజకీయ స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. అందులో భాగంగానే ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అన్ని సామాజిక వర్గాలకు అవకాశం కల్పించారన్నారు. 18 శాసన మండలి స్థానాల్లో బీసీలకు 11, ఎస్సీలకు 2, ఎస్టీలకు 1 చొప్పున మొత్తం 14 మందికి అవకాశం కల్పించడం భారతదేశంలోనే చారిత్రాత్మకమైన నిర్ణయమని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ బీసీల విప్లవం తీసుకువస్తున్నారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భావజాలంతో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అన్నారు. గతంలో రాజ్యసభ సీట్లలో 50 శాతం బీసీలకు కేటాయించడం, తాజాగా ఎమ్మెల్సీ స్థానాల్లో 61 శాతం బీసీలకు ఇవ్వడం ద్వారా సీఎం సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇంతమంది బీసీలను శాసన మండలికి పంపడం ఇదే తొలిసారి అన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో 11 మందికి, రాజ్యసభలో నలుగురికి, లోక్‌సభలో ఆరుగురికి, శాసనసభ్యులుగా 21 మంది బీసీ నేతలు ఉన్నారన్నారు. వెనుకబడిన వర్గాలను చట్టసభల్లోకి తీసుకువస్తానని పాదయాత్రలో ఇచ్చిన వాగ్దానం నెరవేర్చి మాట తప్పని మడమతిప్పని వ్యక్తిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని నవీన్‌బాబు పేర్కొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు



నిరుద్యోగ యువతకు శిక్షణ ధ్రువపత్రం, ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

చింతలపూడి : నిరుద్యోగ యువతీ, యువకులకు స్కిల్ హబ్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ తరగతులు ఉపయోగపడతాయని ఎంపీడీఓ మణికుమారి అన్నారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు నిర్వహించిన శిక్షణా తరగతులు గురువారం ముగిశాయి. ఏలూరు జిల్లాలో మొదటి విడతలో భాగంగా స్కిల్ హబ్ నందు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఎలక్ట్రీషియన్ కోర్సులో శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగ యువతకు శిక్షణా ధృవపత్రం, ఉద్యోగ నియామక పత్రం అందచేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఇ.తమ్మాజీరావు మాట్లాడుతూ వీల్స్ ఇండియా లిమిటెడ్, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, మోహన్ స్పిం టెక్స్ కంపెనీల్లో 30 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఏఎస్‌వి కృష్ణమోహన్, జి.ప్రవీణ్‌కిశోర్, సత్యన్నారాయణ, కార్తీక్, నరసరాజు తదితరులు పాల్గొన్నారు.

28లోగా ఈకేవైసీ నమోదు చేయించుకోండి



బుట్టాయగూడెంలో వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : గిరిజన ప్రాంతంలో పంటలు వేసిన రైతులు తమ పంటల వివరాలను ఈ నెల 28వ తేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ బి.సుమలత తెలిపారు. బుధవారం స్థానిక ఏఓ కార్యాలయంలో వ్యవసాయ సహాయక సిబ్బందితో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని ఆర్‌బీకేల పరిధిలో వివిధ కారణాల వల్ల ఇంకా మండలంలో 1243 మంది ఈకేవైసీ నమోదు చేసుకోలేదని, వారంతా త్వరపడాలన్నారు. రైతు భరోసాకేంద్రాల పరిధిలో ఉన్న రైతులతో వైఎస్సార్ యంత్రసేవా పథకంలో 50శాతం సబ్సిడీ సొమ్మును కట్టించే విధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. అలాగే వచ్చే సోమవారం నాటికి పీఎం కిసాన్, రైతు భరోసా సొమ్ము రైతుల బ్యాంక్ ఖాతాలో పడే అవకాశం ఉందని అన్నారు. అయితే పీఎం కిసాన్ 13వ ఇన్‌స్టాల్‌మెంట్ సొమ్ము వేలిముద్ర వేసిన, ఈకేవైసీ పూర్తి చేసుకున్న రైతులకే వచ్చే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌బీకే, వ్యవసాయ సహాయక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్



ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

జంగారెడ్డిగూడెం : సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఏపీటీఎఫ్ జంగారెడ్డిగూడెం మండల శాఖ అధ్యక్షుడు ఐవీ రత్నం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బి.రెడ్డిదొర మాట్లాడారు. పదవీ విరమణ పొందిన తరువాత ఉద్యోగ ఉపాధ్యాయులకు సామాజిక భద్రత కొనసాగాలంటే పాత పెన్షన్ విధానం తప్పనిసరి అని, సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షన్ దారులందరికీ ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు, పెన్షన్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఐటీడీఏ యాజమాన్యంలోని పండిట్ పీఈటీ పోస్టులను ఉన్నతీకరించాలన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ పీవీఆర్ రాజ్యలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు శాస్త్రి, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

రెండు వేర్వేరు కేసుల నమోదు

జంగారెడ్డిగూడెం: పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఒకే కుటుంబానికి సంబంధించి రెండు వేర్వేరు కేసులు నమోదయ్యాయి. ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికే చెందిన షేక్ అహ్మద్ అలీషా షరీఫ్‌కు, షేక్ మహ్మద్ అబ్దుల్ ఇంతియాజ్ బేగమ్‌లకు 2022 ఏప్రిల్‌లో వివాహమైంది. షరీఫ్ బ్యాంక్‌లో పనిచేస్తుంటాడు. వివాహం అనంతరం బదిలీపై తొలుత దూబచర్ల, అనంతరం తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు వెళ్లారు. భార్యభర్తలు ఇద్దరూ మామిడి కుదురులోనే నివాసం ఉంటున్నారు. అయితే షరీఫ్ తన తల్లిదండ్రుల మాటలు విని అధిక కట్నం కోసం వేధిస్తున్నాడని, ఈ నెల 17న అధిక కట్నం కోసం తనను భర్త షరీఫ్ కొట్టి గాయపర్చాడని ఇంతియాజ్ బేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉండగా తనను తీవ్రంగా కొట్టి గాయపర్చారని భార్య ఇంతియాజ్ బేగం, ఆమె తల్లితండ్రులపై షరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బ్యాంకు నుంచి డబ్బులు తీసుకురమ్మని రోజు తనను వేధిస్తున్నారని, ఈ నెల 18న తాను జంగారెడ్డిగూడెంలోని తల్లితండ్రుల వద్దకు రాగా భార్య, ఇంతియాజ్, ఆమె తల్లితండ్రులు తనను కొట్టి గాయపర్చడంతో పాటు బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



వెంకటేశ్వరరావు, చంద్రరావులను సత్కరిస్తున్న మొబైల్ షాప్ టెక్నీషియన్లు

జంగారెడ్డిగూడెం : స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వందనపు వెంకటేశ్వరరావు, కార్యదర్శి పీపీఎన్ చంద్రరావులను పట్టణంలోని మొబైల్ షాప్ టెక్నీషియన్ యూనియన్ సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి వారిని దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం మొబైల్ షాప్ టెక్నీషియన్ల సమస్యలను యూనియన్ అధ్యక్షుడు పాలడుగుల వెంకట సురేష్ వారికి వివరించారు. ఈ సందర్భంగా వందనపు వెంటేశ్వరరావు, పీపీఎన్ చంద్రరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. యూనియన్ తమ సహాయ సహకారాలు ఉంటాయని, ఎటువంటి సమస్య ఉన్నా తమకు తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీను, వైస్ ప్రెసిడెంట్ పోసిబాబు, నాగు, ఎస్‌కే హమీద్, ఎం.చిన్ని, అంజి, ఆర్.సురేష్, సతీష్, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

బెదిరించాడనే ఫిర్యాదుపై కేసు

కొయ్యలగూడెం : ఒక వ్యక్తి బెదిరించాడంటూ మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీజే విష్ణువర్ధన్ గురువారం పేర్కొన్నారు. బయ్యన్నగూడెం గ్రామానికి చెందిన గుల్లపల్లి జ్యోతి పొలం తగాదాలో అదే గ్రామానికి చెందిన బాలం రత్నాజీ తన పొలంలోకి అక్రమంగా ప్రవేశించాడని ఎదురు తిరిగినందుకు తనతో సహా తన భర్త ఏడుకొండలను చంపుతానని బెదిరించాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. హెడ్ కానిస్టేబుల్ బాబురావు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారన్నారు.

ఎస్‌బీఐ నగర్‌లో చోరీ

చింతలపూడి : స్థానిక ఎస్‌బీఐ నగర్‌లోని గుమ్మళ్ళ సాలోమ్ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. కుటుంబ సభ్యులు శుభ కార్యానికి పొరుగు గ్రామం వెళ్లారు. గురువారం ఉదయం వచ్చి చూసేసరికి ఇంటి వెనుక భాగం తలుపులు పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డ దొంగలు ఇంట్లో ఉన్న 4 కాసుల బంగారు ఆభరణాలు దొంగిలించుకుపోయినట్లు గుర్తించి బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏలూరు నుంచి క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరిస్తున్నారు. సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొయ్యలగూడెం : బయ్యనగూడెం, వేదాంతపురం గ్రామాల పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈఈ మోహన్ రావు తెలిపారు. నేషనల్ హైవే ప్రధాన రహదారి వెంబడి విద్యుత్ స్తంభాలు మార్చుతున్న కారణంగా, 33 కేవీ బయ్యనగూడెం ఫీడర్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

టి.నరసాపురం మండలంలో....

టి.నరసాపురం : మండలంలోని టి.నరసాపురం, బొర్రంపాలెం, మధ్యాహ్నపువారిగూడెం విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ కేఎం అంబేద్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కామవరపుకోట 132/33 కేవీ విద్యుత్ కేంద్రంలో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని, వినియోగదారులు గమనించాలని కోరారు. వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పులు ఉంటాయన్నారు.

3న మార్కెట్ ఆసీల బహిరంగ వేలం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మున్సిపల్ పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రోజువారీ మార్కెట్, వీక్లీ మార్కెట్, జంతు వధశాల యందు రుసుములు వసూలు చేసుకునే హక్కులకు సంబంధించి బహిరంగ వేలం మార్చి 3వ తేదీన నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజువారీ మార్కెట్‌కు రూ.15 లక్షలు, కబేళాకు రూ.లక్ష ధరావత్తు సొమ్మును డీడీ రూపంలో మార్చి 1వ తేదీలోగా దాఖలు చేసిన వారు మాత్రమే బహిరంగ వేలంలో పాల్గొనేందుకు అర్హులన్నారు. వేలంలో పాల్గొనేందుకు ప్రవేశ రుసుము రూ. 2వేలు చెల్లించాలన్నారు. వివరాలకు మున్సిపల్ రెవెన్యూ విభాగంలో సంప్రదించాలన్నారు.

విలేకరులకు ప్రమాద బీమా వర్తింపజేయాలి

కొయ్యలగూడెం : ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న పత్రిక విలేకరులకు 10 లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని గోపాలపురం ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు అనిల్, వెంకటరామిరెడ్డి కోరారు. పాత్రికేయ వృత్తిని కార్మిక చట్టం పరిధిలోకి తీసుకొచ్చి గౌరవ వేతనం ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. పాత్రికేయులకు ప్రమాద బీమా సౌకర్యాన్ని 10 లక్షల రూపాయలు కల్పించడంతోపాటు, పాక్షికంగా దెబ్బతిన్న వ్యక్తికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని కోరారు. మండలంలోని గవరవరంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ పత్రిక విలేకరిని పరామర్శించి.. ప్రెస్‌క్లబ్ తరపున ఆర్థిక సహాయం అందజేశారు.

ఏరియా ఆసుపత్రిని కొనసాగించాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరులో ఏరియా ఆసుపత్రిని కొనసాగించాలని, రద్దు చేసిన 40 స్పెషలిస్టు వైద్య పోస్టులు, 350 బెడ్స్‌ను పునరుద్ధరించాలని, ఏలూరు, దెందులూరు, కై కలూరులలో మూడు ఏరియా ఆసుపత్రులను ఏర్పాటు చేయాలని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ కోరారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన గురువారం పార్టీ నాయకులు విలేకర్లతో మాట్లాడారు. ఏలూరుకు మెడికల్ కాలేజ్ రావడం ఆనందించ దగ్గ విషయమని, ఐతే పాత ఆసుపత్రిలోనే మెడికల్ కాలేజ్‌ను ప్రారంభించడం వల్ల ఇప్పటి వరకు వైద్య సేవలు అందిస్తున్న 40 స్పెషలిస్టు వైద్య పోస్టులు, 150కు పైగా మెడికల్ సిబ్బంది పోస్టులు, 350 బెడ్స్ రద్దు అయ్యాయన్నారు. జిల్లా ఆసుపత్రిలో ప్రతి రోజు ఓపీ 1200, సోమవారం వంటి రోజుల్లో 1800 వరకు ఉంటుందని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలోని 18 లక్షలు జనాభాకు భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నర్సాపురం పట్టణాల్లో ఏరియా ఆసుపత్రులు ఉన్నాయన్నారు. ఏలూరు జిల్లాలోని 21 లక్షల జనాభాకు నూజివీడు, జంగారెడ్డిగూడెం, చింతలపూడిల్లోనే ఏరియా ఆసుపత్రులు ఉన్నాయని చెప్పారు. సమావేశంలో నాయకులు బి.సోమయ్య, జి.రవికిషోర్,వైఎస్ కనకారావు పాల్గొన్నారు.